# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 29 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## శుభాన్షు శుక్లాతో మాట్లాడిన ప్రధాని మోడీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)కు చేరుకున్న తొలి భారతీయుడు శుభాన్షు శుక్లాతో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం మాట్లాడారు. మాతృభూమికి ఆయన దూరంగా ఉన్నప్పటికీ భారతీయుల హృదయాలకు అత్యంత దగ్గరగా ఉన్నారని కొనియాడారు. 'మీ పేరులోనే శుభం ఉంది. కొత్త యుగానికి మీ యాత్ర శుభారంభంగా నిలుస్తుంది' అని అన్నారు. కాగా, భారత వ్యోమగామి, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా కూడా ప్రధాని మోదీతో మాట్లాడారు. 'ఇది నా ఒక్కడి ప్రయాణం కాదు, మన దేశానిది కూడా' అని అన్నారు. భారతదేశం చాలా అద్భుతంగా ఉన్నదని, మ్యాప్‌లో కంటే పెద్దగా కనిపిస్తున్నది తెలిపారు. అలాగే ఐఎస్ఎస్‌లో తన జీవితం ఎలా ఉన్నది, తన కార్యకలాపాల గురించి ఆయన వివరించారు.


# మూడు ప్రాంతాలుగా విభజన



- తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా..
- రాష్ట్రం సమ్మిళిత, సమగ్రాభివృద్ధి సాధించడానికి సంబంధించిన విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 9 లోపు విడుదల చేస్తాం
- పీజేఆర్ సేవలు ప్రజల్లో చిరస్మరణీయం
- పీజేఆర్ వల్లే హైటెక్ సిటీ నిలిచింది
- మూసీకి ఎందుకు నిధులివ్వలేదో కిషన్‌రెడ్డి చెప్పాలి
- నగరానికి వస్తున్న అమిత్ షాను కలుస్తాం
- సిటీకి అవతల డీజిల్ బస్సులు.. లోపల 3వేల ఎలక్ట్రిక్ బస్సులు
- 2029లో నాలుగు నియోజకవర్గాలుగా శేరిలింగంపల్లి
- సినీనటుడు నాగార్జున ముందుకొచ్చి 2 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించారు
- గచ్చిబౌలిలో పీజేఆర్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణను కోర్ అర్బన్, సెమీ అర్బన్, రూరల్‌గా.. మూడు ప్రాంతాలుగా విభజించి రాష్ట్రం సమ్మిళిత, సమగ్రాభివృద్ధి సాధించడానికి సంబంధించిన విజన్ డాక్యుమెంట్‌ను డిసెంబర్ 9 వ తేదీలోపు విడుదల చేయనున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌ను ప్రపంచ శ్రేణి నగరంగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలందరి సహకారం ఉండాలని విజ్ఞప్తి చేశారు. గచ్చిబౌలి కూడలిలో ఆరు లేన్లతో నిర్మించిన దివంగత పి జనార్ధన్ రెడ్డి ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తెలంగాణను మూడు ప్రాంతాలుగా.. ఓఆర్ఆర్ లోపలి భాగంలో కోర్ అర్బన్‌గా, ఓఆర్ఆర్ అవతలి నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు సెమీ-అర్బన్‌గా, రీజినల్ రింగ్ రోడ్డు అవతలి భాగంలో గ్రామీణ ప్రాంతంగా విభజించి, ప్రాంతాల వారిగా ప్రణాళికా బద్ధమైన అభివృద్ధితో ముందుకు వెళతాం. ఓఆర్ఆర్ ఆవలివైపున 30 వేల ఎకరాల్లో ప్రపంచ శ్రేణి భారత్ ఫ్యూచర్ సిటీని ప్రతిపాదించాం. ఇందులో క్రీడలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, నాన్-పొల్యూటెడ్ ఫార్మా రంగాలను అభివృద్ధి పరుస్తాం. ఫ్యూచర్ సిటీలో పచ్చదనం కోసం దాదాపు 15 వేల ఎకరాల్లో పార్కులను, మిగతా ప్రాంతంలో మౌలిక సదుపాయాలను కల్పిస్తాం.



వాయు కాలుష్యంతో ఢిల్లీ, విపరీతమైన ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు, వర్షాలొస్తే వరదలతో చెన్నై నగరాలు అతలాకుతలమవుతున్న పరిస్థితుల నుంచి పాఠాలు నేర్చుకోవలసిన అవసరం ఉంది. హైదరాబాద్‌ను ప్రపంచ శ్రేణి నగరంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో పనిచేస్తున్నాం. నగరంలో కాలుష్యం నివారించాలన్న లక్ష్యంతోనే ఎలక్ట్రిక్ వాహనాలపై రిజిస్ట్రేషన్ పన్నులను పూర్తిగా రద్దు చేశాం. జంట నగరాల్లో తిరుగుతున్న 3 వేల ఆర్టీసీ బస్సులను ఓఆర్ఆర్ బయటి ప్రాంతాలకు తరలించి వాటి స్థానంలో వచ్చే ఏడాది లోపు 3 వేల ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తెస్తున్నాం. కాలుష్యాన్ని తగ్గించాలన్న ఉద్దేశంతో అనేక విధాలుగా పనిచేస్తున్నాం. నాలాలు, చెరువులు కబ్జాలు చేశారు. నీరుండాల్సిన చోట అపార్ట్‌మెంట్లు వెలువడంతో నీరు రోడ్లపైకి వస్తోంది. అందుకే నాలాలు, చెరువుల ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టాం. దీన్ని కొందరు రాజకీయం చేసి అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారు. అభివృద్ధిలో అందరూ కలిసి రావాలి. ఆ మధ్య కాలంలో ఎన్-కన్వెన్షన్ కూల్చివేసిన సందర్భంగా సినీనటుడు నాగార్జున ముందుకొచ్చి 2 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించి మిగితా 2వ పేజీలో

## మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్‌లు సిద్ధం

- 30 సర్కిళ్లలో 150 టీమ్‌లు
- బాధ్యతలు అప్పగించిన హైడ్రా
- జూలై 1 నుంచి విధులు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వర్షాకాలం వరద ముప్పు నుంచి నగరాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన మాన్సూన్ ఎమర్జెన్సీ టీమ్(ఎంఈటీ)లు సిద్ధమయ్యాయి. టెండర్ల ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత ఎంపిక చేసిన ఎంఈటీలకు సర్కిళ్లవారీ విధులను శనివారం హైడ్రా అప్పగించింది. మొత్తం 30 సర్కిళ్లలో 150 టీమ్‌లు జులై 1వ తేదీ నుంచి పని చేయనున్నాయి. విధి నిర్వహణలో ఎక్కడా ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ బందాలకు సూచించారు. వర్షం ఎప్పుడు పడినా అప్రమత్తంగా ఉండి.. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. వర్షానికి ముందే రహదారుల్లో నీరు వెళ్లేందుకు ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. నాలాలను, కల్వర్టులను పరిశీలించి.. వరద నీటి ప్రవాహం సాఫీగా సాగేలా జాగ్రత్తపడాలన్నారు. ఎక్కడ నీరు నిలుస్తుందో ముందుగానే ఒక అంచనాకు వచ్చి.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. చెట్లు పడిపోతే వెంటనే వాటిని తొలగించాలి. 150 ఎంఈటీ బందాలకు హైడ్రా డీఆర్ఎఫ్ బందాలు కూడా సహకరిస్తాయని.. సమన్వయంతో పని చేయాల్సినవసరం ఉందని చెప్పారు. వరద నివారణ చర్యలకు అవసరమైన పనిముట్లను అందజేస్తుందని, అలాగే సిబ్బందికి హైడ్రా శిక్షణ కూడా ఇస్తుందని అన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా ఆయా ప్రాంతాల హైడ్రా ఎస్ఎఫ్‌వోలకు తెలియజేయడమే కాకుండా ఆ సమాచారాన్ని హైడ్రా ఉన్నతాధికారుల దష్టికి తీసుకు రావాలని సూచించారు. ఈ వర్షాకాలం నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పని చేసి మంచి గుర్తింపు పొందాలని హైడ్రా కమిషనర్ దిశానిర్దేశం చేశారు.

### వర్షంపై సరైన సమాచారం కోసం హైడ్రా కసరత్తు

### వివిధ విభాగాలతో హైడ్రా సమన్వయం

వర్షానికి సంబంధించి సరైన సమాచారం తెలిస్తే నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవచ్చని హైడ్రా భావిస్తోంది. ఇందులో భాగంగా వివిధ శాఖలకు చెందిన విభాగాలతో సమన్వయం చేసేలా ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో 'పట్టణ ప్రాంతాల్లో వాతావరణ అంచనా, పర్యవేక్షణ' అనే అంశంపై శనివారం హైడ్రా కార్యాలయంలో సదస్సును నిర్వహించింది. వర్షానికి సంబంధించి సరైన సమాచారం ముందుగానే నగర ప్రజలకు అందించడానికి అనుసరించాల్సిన పద్ధతులపై చర్చించారు. ఎంత మొత్తంలో, ఏఏ ప్రాంతాల్లో, ఎప్పుడు వర్షం పడుతుందో కచ్చితమైన సమాచారం తెలిస్తే సత్ఫలితాలు వస్తాయని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సమావేశంలో తెలిపారు. ఇందుకు అనుసరించాల్సిన మిగితా 2వ పేజీలో

## విద్యుత్ ప్రాజెక్టుల్లో వేగం పెంచాలి



- రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క
- సింగరేణి ప్రాజెక్టులపై ఉపముఖ్యమంత్రి భట్టి సమీక్ష

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సింగరేణి సంస్థ చేపట్టనున్న పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టుల అమలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం మహాత్మా జ్యోతిరావ్ పూలే ప్రజాభవన్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన ఈ సూచనలు చేశారు. సింగరేణి సంస్థ ప్రతిపాదించిన 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్, 500 మెగావాట్ల పవన విద్యుత్, 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను నిర్దిష్ట కాలపరిమితితో చేపట్టాలని, వాటి కోసం అవసరమైన అనుమతులు వెంటనే తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

లోయర్ మానేరు డ్యాం పై 300 మెగావాట్లు, మల్లన్నసాగర్ పై 500 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లకు అనుమతుల కోసం ఇరిగేషన్ శాఖతో నిత్యం సంప్రదింపులు జరపాలని సూచించారు. రామగుండం-1 ఏరియాలో మేడిపల్లి ఓపెన్‌కాస్ట్ ఆధారంగా ప్రతిపాదించిన 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ పనులను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ఏర్పాటుచేయనున్న పవన విద్యుత్ ప్లాంట్లకు సంబంధించి డీపీఆర్‌లు వచ్చే నెలాఖరు కల్లా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రాజస్థాన్ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థతో ఒప్పందం మేరకు 1500 మెగావాట్ల సోలార్ ప్లాంట్, 800 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టును త్వరితగతిన ప్రారంభించాలని, వీటిని కేబినెట్ ఆమోదానికి తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగరేణి సంస్థ ద్వారా గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్, బ్యాటరీ స్టోరేజ్ సిస్టం వంటి ఆధునిక పథకాలపై కూడా సమీక్షించామని మంత్రి తెలిపారు. అన్ని శాఖల ప్రగతిని సమీక్షించేందుకు డిజిటల్ డాష్‌బోర్డ్ రూపొందించాలని ఆయన సూచించారు. సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, రెడ్కో వైస్ చైర్మన్ అండ్ ఎండీ అనీలా, ఇతర అధికారులు సుభాని, చిరంజీవులు, జానకీ రామ్, శ్రీనివాసులు, సుబ్బారావు పాల్గొన్నారు.

## మూడు రోజుల పాటు వర్షాలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలో రాగల 3 రోజులపాటు ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శనివారం అంచనా వేసింది. పలు జిల్లాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు పడుతాయని పేర్కొంది. సోమవారం రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు పడే అవకాశం ఉందని వివరించింది. ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లితో పాటు పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి.

## వైద్యారోగ్యశాఖలో... 607 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీకి మరో నోటిఫికేషన్ విడుదలైంది. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండ్రోజుల క్రితమే డెంటల్ అసిస్టెంట్ సర్జన్, స్పీచ్ థెరపిస్ట్ పోస్టులకు బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకుగానూ జులై 10 నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో గడచిన 17 నెలల్లో 8 వేలకు పైగా పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. మరో 2,322 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మసిస్ట్, 1,284 ల్యాబ్ టెక్నీషియన్, 1,931 మల్టి పర్పస్ ఫీమేల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది. ఇప్పటికే ఆయా పోస్టుల ఫలితాలు విడుదలయ్యాయి. మెరిట్ జాబితాలు సిద్ధమైతున్నాయి.

## 33 మందికి అదనపు కలెక్టర్లుగా పదోన్నతి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

33 మందికి అదనపు కలెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. పదోన్నతులు కల్పించడంపై హర్షం వ్యక్తంచేశారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## చివరి మృతుడి గుర్తింపు..

- ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం మృతుల సంఖ్య 260గా నిర్ధారణ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జూన్ 12న జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలోమరణించిన చివరి మృతుడ్ని కూడా డీఎన్ఏ పరీక్ష ద్వారా గుర్తించారు. మృతదేహాన్ని బాధిత కుటుంబానికి అప్పగించారు. దీంతో ఈ విమాన ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 260గా అధికారికంగా లెక్కతేల్చారు. 181 మంది ప్రయాణికులు, నేలపై మరణించిన 19 మందితో కలిపి 200 మంది మృతులు భారతీయులు. 52 మంది బ్రిటిష్ జాతీయులు, ఏడుగురు పోర్చుగీస్ జాతీయులు, ఒక కెనడియన్ ఈ ప్రమాదంలో చనిపోయినట్లు ప్రభుత్వం శనివారం పేర్కొంది. కాగా, ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మొత్తం 270 మంది మరణించినట్లు తొలుత అధికారులు పేర్కొన్నారు. 230 మంది ప్రయాణికుల్లో 40 ఏళ్ల బ్రిటీష్ జాతీయుడు విశ్వాస్ కుమార్ రమేష్ ఒక్కడే లక్కీగా ప్రాణాలతో బయటపడ్డాడు. మిగతా 229 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో సహా విమానంలోని 241 మంది మంటల్లో సజీవ దహనమయ్యారు. ఈ నేపథ్యంలో డీఎన్ఏ పరీక్షల ద్వారా మృతులను గుర్తించారు.

## ప్రముఖ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య..!

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



ప్రముఖ టీవీ న్యూస్ ఛానల్ యాంకర్ స్వేచ్ఛ వొటార్కర్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. శుక్రవారం రాత్రి చిక్కడపల్లిలోని జవహర్‌నగర్‌లోని తన నివాసంలో స్వేచ్ఛ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిక్కడపల్లి పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. యాంకర్ స్వేచ్ఛ మృతిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపారు.

యాంకర్ స్వేచ్ఛకు 2014లో భర్త క్రాంతి కిరణ్‌తో విడాకులయ్యాయి. ఆపై కొన్ని రోజుల పాటు రాంనగర్‌లో తల్లిదండ్రులు శంకర్, శ్రీదేవితో కలిసి నివాసం ఉన్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం స్వేచ్ఛ తన కూతురితో కలిసి ఒంటరిగా జవహర్‌నగర్‌లోని శీలం రెసిడెన్సిలో పెంట్ హౌస్‌లో నివాసం ఉంటున్నారు. స్వేచ్ఛ స్నేహితుడు కూడా అదే ఇంట్లో ఉంటున్నాడని సమాచారం. శుక్రవారం రాత్రి 9.30 గంటలకు ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చిక్కడపల్లి పోలీసులకు సమాచారం అందింది. ఇంట్లోకి వెళ్లి చూడగా స్వేచ్ఛ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించారని పోలీసులు తెలిపారు. రాత్రి 8.30 గంటల సమయంలో ఆమె మిగితా 2వ పేజీలో

## భౌతికదాడులు మంచిది కాదన్న కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఎన్నటికీ ఆస్కారం ఉండకూడదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ సూచించారు. శాంతియుతంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఫోన్ ట్యాపింగ్ పై ఒక ఛానల్ ప్రసారంచేసిన కార్యక్రమంపై ఆగ్రహించిన బిఆర్ఎస్ కార్యకర్తలు ఆ ఛానల్ కార్యాలయంపై దాడి చేసి విధ్వంసం సృష్టించారు.. దీనిపై స్పందించిన కెటిఆర్ ఇటువంటి దాడులు మంచివి కాదంటూ తమ పార్టీ నేతలకు, కార్యకర్తలకు హితవు పలికారు.. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. రేవంత్‌రెడ్డి లాంటి నేతలు ఈ రాష్ట్రాన్ని నడిపిస్తుంటే, అబద్ధాలు, దుష్ప్రచారం అంశాలుగా సమాజంలో రోజువారి సాధారణ అంశాలుగా మారిపోతాయని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు ఎన్నటికీ ఆస్కారం ఉండకూడదని సూచించారు. శాంతియుతంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కాగా, కొన్ని మీడియా సంస్థలు, జర్నలిస్టుల వ్యవహారశైలిపై తీవ్రంగా మండిపడ్డారు కెటిఆర్. తనపై, తమ పార్టీ నాయకత్వంపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కొన్ని నెలలుగా కొందరు వ్యక్తులు జర్నలిస్టుల ముసుగులో తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా పదేపదే ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## తెలంగాణలో 44 మంది డీఎస్పీల బదిలీలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పోలీస్ విభాగంలో భారీ స్థాయిలో బదిలీలు చోటుచేసుకున్నాయి. శనివారం రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ఉత్తర్వుల మేరకు 44 మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ) స్థాయి అధికారులను వివిధ విభాగాలు, కమిషనరేట్‌లకు బదిలీ చేసి, కొత్తగా నియమించారు. ఈ బదిలీలు నార్కోటిక్స్ కంట్రోల్, ట్రాఫిక్, స్పెషల్ ఆపరేషన్స్ యూనిట్లు, లా అండ్ ఆర్డర్ విభాగాల మధ్య జరగడం గమనార్హం. ఈ బదిలీలతో పోలీస్ వ్యవస్థ మరింత ప్రభావవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకున్నట్టు పోలీస్ శాఖ ప్రకటించింది.

ముఖ్య బదిలీలలో కొందరి వివరాలు ఇలా ఉన్నాయి: బి. కిషన్ కుమార్ - ఏసీపీ, ఆసిఫ్‌నగర్, జి. శ్యామ్ సుందర్ -ఏసీపీ, మిర్చౌక్, కె. శంకరయ్య -డీఎస్పీ, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, పి. సత్తయ్య-ఏసీపీ, స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ), రాచకొండ వై. నాగేశ్వరరావు -ఏసీపీ, సీసీఎస్, సైబరాబాద్‌కె. చంద్రశేఖర్ రెడ్డి -ఏసీపీ, మాధాపూర్ (ట్రాఫిక్), వై. నర్సింహారెడ్డి - డీఎస్పీ, జీహెచ్ఎంసీ, పి. శ్రీనివాస్ - డీజీపీ కార్యాలయానికి నియమించారు.

## టీవీ ఛానెల్ కార్యాలయంపై దాడి



- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మహా టీవిలో కేటీఆర్ పై కథనాలు
- అవాస్తవ వార్తలు ప్రసారం చేస్తున్నారనే బీఆర్ఎస్ నాయకుల విధ్వంసం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై అవాస్తవ వార్తలు ప్రసారం చేస్తున్నారని ఆగ్రహంతో బీఆర్ఎస్ కార్యకర్తలు మహా న్యూస్ టీవీ చానల్ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారు. వివరాల్లోకెళ్తే.. మహా న్యూస్ కార్యాలయం వైపు శనివారం ఒక్కసారిగా గుంపులా వచ్చిన బీఆర్ఎస్ కార్యాకర్తలు ముందుగా ఆఫీసు ఎదురుగా ఉన్న కార్లపై దాడికి దిగారు. అద్దాలు పగలగొట్టారు. అనంతరం కార్యాలయం లోపలకు చొచ్చుకు వెళ్లి రిసెప్షన్‌తో పాటు స్టూడియోను ధ్వంసం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల దాడితో ఉద్యోగులంతా భయాందోళనకు గురయ్యారు.తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యాలయం బయట నిలిపి ఉంచిన కారు కూడా ధ్వంసవమైంది. అయితే శాంతియుత్ర నిరసన వ్యక్తం చేస్తున్న తమపై న్యూస్ ఛానెల్ ప్రతినిధులు దాడికి పాల్పడ్డారని బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఆరోపించారు. దీంతో ఇరుపక్షాల మధ్య ఘర్షణ చోటుచేసుకొని ఉద్రిక్తతలకు దారితీసిందని తెలిపారు. కొన్ని రోజుల నుంచి తప్పుడు థంబ్ నెయిల్స్‌ను మహాటీవీ వార్తలు ప్రసారం చేస్తున్నారని బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు ఈ విషయంలో పలుమార్లు పార్టీ విజ్ఞప్తులు చేసినా కూడా మహాటీవీ ఎలో మార్పు రాలేదన్నారు. పైగా తన యూట్యూబ్ ఛానెల్లో తప్పుడు వంటి నెయిల్స్ పెట్టి. బీఆర్ఎస్ నాయకుల పై వ్యక్తిగత దూషణలు, అవమానకరమైన కథనాలుమహాటీవీ ప్రసారం చేసిందన్నారు.

దాడి అనంతరం మహా టీవీ అధినేత వంశీ విలేకరులతో మాట్లాడారు. తాము అడ్డగోలుగా కథనాలను ప్రసారం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని.. ప్రజాస్వామ్యయుతంగా నిరసన చేపట్టవచ్చుని.. ఇలా దాడులు చేయడం సరైన విధానం కాదన్నారు. ఈ విషయంలో తాను వెనక్కి తగ్గబోనని.. దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తర్వాత ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్‌ను బీఆర్ఎస్ భవన్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. మిగితా 2వ పేజీలో



## సాంకేతికంగా జూరాల భద్రం

**బలగం టీవి, హైదరాబాద్**

జూరాల ప్రాజెక్టు సాంకేతికంగా పూర్తి భద్రంగా ఉందనీ, ప్రతి నీటిపారుదల ప్రాజెక్టునూ పూర్తి సామర్థ్యంతో వినియోగించేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నదని నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టు గేట్ల వద్ద రోప్‌వే సమస్య ఏర్పడిన నేపథ్యంలో శనివారం పశుసంవర్ధక, యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు, ర్యాలంపాడు రిజర్వాయర్‌ను ఉత్తమ్ సందర్శించారు. జూరాల గేట్ల వద్ద ఏర్పడిన సమస్యలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. జూరాల ప్రాజెక్టు 62 గేట్లలో 58 గేట్లు నిర్విరామంగా పని చేస్తున్నాయనీ, తాత్కాలికంగా నాలుగు గేట్లకు రోప్‌వే సమస్య తలెత్తినప్పటికీ, దాని వల్ల ఎలాంటి ప్రమాదమూ లేదని తెలిపారు. గతంలో ఎన్నో భారీ వరదలను జూరాల డ్యామ్ ఎదుర్కొందని, ఇప్పుడు ప్రభుత్వం పూర్తి భద్రతా చర్యలు తీసుకుంటోందని అన్నారు.

దశాబ్ద కాలంలో రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. ప్రస్తుతం పాత తప్పిదాలను సరిచేసే దిశగా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఇరిగేషన్‌లో ఆపరేషన్ మెయింటెన్స్ పట్ల ప్రత్యేక దృష్టి సారించి, ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జూరాల డ్యాంపై నుంచి భారీ వాహనాలు వెళ్లడాన్ని గతంలోనే నిషేధించేలా సాంకేతిక నివేదికలు ఇచ్చినప్పటికీ, గత ప్రభుత్వ పాలనలో పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు సమస్య తీవ్రతను గుర్తించి, జూరాల ఆవరణలో ఆల్టర్నేట్ రోడ్, వాహనాల వంతెన కోసం రూ.100 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. జూరాల, మంజీరా, నాగార్జునసాగర్ వంటి ప్రధాన ప్రాజెక్టులన్నింటికీ రొటీన్ మెయింటెనెన్స్ చేపట్టి భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు.

జూరాల ప్రాజెక్టు ఒడిదుడుకులు వచ్చినా తట్టుకుని నిలబడిందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. 2009లో వచ్చిన భారీ వరదల సమయంలోనూ రోజుకి 12 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, అయినా ప్రాజెక్టు ఏమాత్రం నష్టాన్ని ఎదుర్కోలేదని అన్నారు. కొంతమంది కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అలాంటి అసత్యాల్ని నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జూరాల ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంతం సస్యశ్యామలంగా మారిందని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సాగునీటి లభ్యత పెరిగిందనీ, ర్యాలంపాడు ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచేందుకు రెండు నుంచి నాలుగు టీఎంసీల నీటిని నిల్వ చేసే పనులను వేగవంతం చేయాలని అన్నారు. జూరాల ప్రాజెక్టు పైనుంచి భారీ వాహనాలు వెళ్లకుండా, రాకుండా రోడ్డుకు బ్రిడ్జి ఏర్పాటు చేయడానికి కృషి చేసిన మంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మూడు ప్రాంతాలుగా విభజన

(మొదటి పేజీ తరువాయి)

చెరువును అభివృద్ధి పరచడానికి సహకరిస్తామని చెప్పారు. కబ్జాలకు గురైన బతుకమ్మ కుంట 6 ఎకరాలను కాపాడగలిగాం.

జంట నగరాల అభివృద్ధికి దివంగత పీజేఆర్ గారు అందించిన సేవలు ప్రజల్లో చిరస్మరణీయంగా గుర్తుండిపోతాయి. 1.2 కోట్ల జంట నగరాల ప్రజల దాహార్తి తీరిందంటే అది పీజేఆర్ నాయకత్వంలో జరిగిన పోరాటాల ఫలితమే. అలాంటి పీజేఆర్ పేరును ఫ్లైఓవర్‌కు పెట్టుకోవడం ఎంతో సముచితం. గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి ప్రపంచంలోనే ఫార్చ్యూన్ 500 కంపెనీల్లో 85 కంపెనీలు హైదరాబాద్ నుంచి పనిచేస్తున్నాయి. లక్షలాది మంది యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయి. లక్షలాది మందికి ఉపాధి కల్పించాలన్న సంకల్పంతోనే 2.8 లక్షల కోట్ల విదేశీ పెట్టుబడులను సాధించాం. ఈ నగరాన్ని మరింత గొప్ప నగరంగా తీర్చిదిద్దాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు. ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. 2028 వరకు రాజకీయాలను పక్కన పెడుతాం. అభివృద్ధికి అందరూ సహకరించాలి. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ప్రజా ప్రతినిధులు అనిల్ కుమార్ యాదవ్ , అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, అద్దంకి దయాకర్ , బల్మూరు వెంకట్ , ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి , డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లతో పాటు జీహెచ్‌ఎంసీ కమిషనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ ఫ్లైఓవర్‌కు దివంగత పీజేఆర్ ఫ్లైఓవర్‌గా నామకరణం చేసినందుకు వారి కుమార్తె విజయారెడ్డితో పాటు కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

## టీవీ ఛానెల్ కార్యాలయంపై దాడి

(మొదటి పేజీ తరువాయి)

మహా టీవీ న్యూస్ కార్యాలయంపై దాడి జరిగిన నేపథ్యంలో రాష్ట్ర మంత్రులు రంగంలోకి దిగారు. ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే మహా టీవీ కార్యాలయానికి వేరువేరుగా చేరుకుని సందర్శించారు. ఈ సందర్భంగా దాడి జరిగిన తీరు.. పరికరాలు ధ్వంసమైన తీరును మంత్రులకు ఛానల్ అధినేత వివరించారు. జరిగిన దాడిని మంత్రులు ఖండించారు. ఈ దాడి వెనుక ఉన్న వారందరినీ కచ్చితంగా గుర్తిస్తామని.. చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రుల వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. జూబ్లీహిల్స్‌లో మహాన్యూస్ కార్యాలయంపై జరిగిన దాడిని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన కార్యాలయాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

# భారత్ ఫ్యూచర్ సిటీ భూ సేకరణ తక్షణమే పూర్తి చేయండి

- **పెట్టుబడుల రాకకు అధికారి యంత్రాంగం సిద్ధంగా ఉండాలి**
- **సీఎం రేవంత్ రెడ్డి**
- **పరిశ్రమల శాఖపై సమీక్ష**

**బలగం టీవి, హైదరాబాద్**

భారత్ ఫ్యూచర్ సిటీ ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చేలా పరిశ్రమల శాఖ పూర్తి సన్నద్ధంగా ఉండాలని సూచించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి సీఎం శనివారం పరిశ్రమల శాఖపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డేటా సెంటర్ల ఏర్పాటుకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారుతున్నందున, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్థలాన్ని ముందుగానే సిద్ధం చేయాలని పేర్కొన్నారు. నిమ్స్ ప్రాంతంలో మిగిలి ఉన్న భూసేకరణ తక్షణమే పూర్తి చేసి రైతులతో చర్చలు జరిపి ఒప్పించాలని ఆదేశించారు.



### ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్

ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్న ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు కల్పించాలని, ఇందుకోసం ప్రఖ్యాత స్పోర్ట్స్ ఆర్కిటెక్ట్‌ను నియమించాలని సూచించారు. క్రికెట్, ఫుట్‌బాల్, గోల్ఫ్ వంటి క్రీడలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు.

### ప్రతి 15 రోజులకు సమీక్ష

రాష్ట్రంలో ప్రతిపాదిత మెగా ప్రాజెక్టులపై మంత్రివర్గ ఉపసంఘం ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశమై పురోగతిని సమీక్షించాలని సీఎం ఆదేశించారు. 2024లో హైదరాబాద్‌కు 70 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు వచ్చాయని, 2025లో ఇప్పటివరకు 25 కేంద్రాలు వచ్చాయని చెప్పారు. మిగతా సంస్థల రాకకు అధికారులు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సమీక్షలో పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ‘రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో నూతన ఆరోగ్య పథకం’

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలో నూతన ఆరోగ్య పథకం అమల్లోకి రానుందని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులకు ఆరోగ్య పథకం లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రిని కలిసి వివరించినట్టు తెలిపారు. “రాష్ట్రంలో సరైన ఆరోగ్య పథకం అమల్లో లేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన డిప్యూటీ తహశీల్దార్ రాజేష్ ఖన్నా ఇటీవల తీవ్ర అనారోగ్యం పాలై ఆస్పత్రిలో చేరడంతో అతడి కుటుంబం చాలా ఇబ్బందులు పడింది. రాష్ట్రంలో ఏ ఉద్యోగికి అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే తక్షణమే నూతన ఆరోగ్య పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేయాలి” అని మంత్రిని కోరినట్టు లచ్చిరెడ్డి తెలిపారు. సానుకూలంగా స్పందించిన మంత్రి ఉద్యోగులకు త్వరలో సరికొత్త విధానంతో ఆరోగ్య పథకాన్ని అందుబాటులోకి తెస్తున్నట్టు ఈ సందర్భంగా హామీ ఇచ్చినట్టు జేఏసీ నేతలు తెలిపారు. గ్రామ పాలనా అధికారుల(జీపీఓ)కు క్షేత్ర స్థాయిలో వెంటనే విధులు కేటాయించాలని ప్రభుత్వానికి జేఏసీ నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సీసీఎల్‌ఏ కమిషనర్ లోకేష్‌కుమార్‌ను కలిసి రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై వినతి పత్రం అందించారు. జీపీఓల నియామకాల కోసం ఇప్పటికే అర్హత పరీక్షను నిర్వహించి తుది జాబితాను వెల్లడించినట్టు గుర్తు చేశారు. జీపీఓలను విధుల్లోకి తీసుకోవడంతో ఇతర ఉద్యోగులపై ఒత్తిడి తగ్గుతుందని చెప్పారు. అలాగే సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల (అడిషనల్ కలెక్టర్) పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని కోరారు. దీనిపై లోకేష్‌కుమార్ సానుకూలంగా స్పందించారు. రెవెన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రమేష్ పాక, ఎం.రాధ, బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, తదితరులు ఉన్నారు.

## మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్‌లు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పద్ధతులపై వివిధ శాఖలు, విభాగాలకు చెందిన నిపుణులు కలసి పని చేయాల్సినవసరం ఉందన్నారు. వర్షానికి సంబంధించిన కచ్చితమైన సమాచారం ఇవ్వగలిగితే, నగరంలో ప్రమాదాలతోపాటు ట్రాఫిక్ సమస్యను కొంతమేర తగ్గించవచ్చునని అభిప్రాయపడ్డారు.

హైడ్రా, వాతావరణ శాఖ(ఐఎండీ), తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్, తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్, ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి ఒక వర్కింగ్ గ్రూప్‌ను ఏర్పాటు చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. విభాగాలన్నీ సమన్వయంతో పని చేసి వర్షాన్ని అంచనా వేయడంతో పాటు, తర్వాత జరిగే పరిణామాలను ఎదుర్కొనేందుకు యంత్రాంగాన్ని సన్నద్ధం చేయవచ్చని అభిప్రాయపడ్డారు. నగరంలో దాదాపు 157 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్లున్నాయని.. వీటి సంఖ్యను పెంచుకోవాల్సి ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలను ఇందుకు వేదికలు చేసుకోవాలని సూచించారు. గాలుల తీవ్రతను కూడా అంచనా వేయాల్సినవసరం ఉందన్నారు. ఒక చదరపు కిలోమీటరు పరిధిలో ఒక సెంటీమీటర్ వర్షం పడితే 9.96 మిలియన్ లీటర్ల నీరు అందుబాటులోకి వస్తుందని, ఆ నీరు ఎంత మేర భూమిలోకి ఇంకుతుందో చూసుకుని వరదను అంచనా వేయవచ్చునని ఐఎండీ రిటైర్డ్ డీజీ డా. కేజే రమేష్ అన్నారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, రీజనల్ ఫైర్ ఆఫీసర్ జయప్రకాష్, ఐఎండీ తెలంగాణ డైరెక్టర్ నాగరత్న, టీజీడీపీఎస్ కన్సల్టెంట్ రామారావు, ఐఎండీ నుంచి శ్రీధర్, ఎన్ ఆర్ ఎస్ సీకి చెందిన నరేంద్ర, సురేంద్రబాబు, ఇన్‌కాయిస్ డా. ప్రసాద్, ఐఐటీ ప్రొఫెసర్ సతీష్, వెదర్ మ్యాన్ బాలాజీ తదితరులు ఈ సదస్సులో పాల్గొని పలు సూచనలు చేశారు..

## ప్రముఖ యాంకర్ స్వేచ్ఛ ఆత్మహత్య..!

(మొదటి పేజీ తరువాయి)

చనిపోయి ఉంటారని ప్రాథమికంగా అంచనా వేశారు. యాంకర్ స్వేచ్ఛ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కుటుంబ కలహాల కారణంగా స్వేచ్ఛ ఆత్మహత్య చేసుకుని ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో స్వేచ్ఛ ఈసీ మెంబర్‌గా ఎన్నికయ్యారు.

## మెదక్ జిల్లాలో విషాదం

### భవనం పైనుంచి దూకి ఒక కుటుంబం ఆత్మహత్యాయత్నం

**బలగం టీవి, హైదరాబాద్**

మెదక్ జిల్లాలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. మెదక్ జిల్లా కోర్టు భవనం పైనుంచి దూకి ఒక కుటుంబం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శనివారం జరిగిన ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల ప్రకారం, దంపతులు తమ ఇద్దరు కుమార్తెలతో కలిసి కోర్టు భవనం పైకి చేరుకొని, అక్కడి నుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ దుర్ఘటనలో భార్య మృతి చెందగా, భర్త మరియు ఇద్దరు కుమార్తెలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితులను దౌలతాబాద్ గ్రామ వాసులుగా గుర్తించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న దర్యాప్తు ప్రారంభించారు.

# విద్యా ప్రమాణాలు పెంపొందించాలి..



**● పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**బలగం టీవీ, పెద్దపల్లి**

సర్కారు బడుల్లో చదివే విద్యార్థులలో విద్యా ప్రమాణాలు పెంపొందించటమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. కలెక్టరేట్‌లో కాల్వ శ్రీరాంపూర్ మండల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం కలెక్టర్ సమావేశమయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, పాఠశాలల నిర్వహణ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే లక్ష్యాలను నిర్దేశించుకోని వాటి సాధన దిశగా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు విధులకు సహకాలంలో హాజరు కావాలన్నారు. ప్రాథమిక తరగతుల లోనే తెలుగు, ఇంగ్లీష్ చదవడం, రాయడం, బేసిక్ మ్యాథ్స్?? వంటి కనీస విద్యా ప్రమాణాలు ప్రతి విద్యార్థికి రావాలన్నారు. సమావేశంలో పీఎం షేక్, ప్రధానోపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కరించాలని నిరసన

**బలగం టీవీ, పెద్దపల్లి**



కరీంనగర్ నగరపాలక సంస్థలలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ కార్మిక విభాగం ఆధ్వర్యంలో శనివారం కార్యాలయం ఎదుట భారీగా ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు, పారిశుద్ధ విభాగ అధికారుల తీరును తీవ్రంగా విమర్శించారు. పారిశుద్ధ పనుల్లో వ్యక్తిగత కక్షలతో కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అధికారుల వేధింపులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని నేతలు ఆరోపించారు. ఉద్యోగులకు కావాల్సిన పనిముట్లు, రక్షణ కిట్‌లు సమయానికి అందకపోవడంతో వృత్తిపరంగా సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. అలాగే వేతనాలు సకాలంలో చెల్లించాల్సిందిగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ కార్మిక విభాగం నాయకుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "కార్మికులపై అధికారులు గయాజులు వేస్తున్నారు. వాడకపోయినా పనిముట్లు తామే ఉపయోగించారని చెబుతున్నారు. ఇది పూర్తిగా అన్యాయమని" పేర్కొన్నారు. కార్మికుల హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని చెప్పారు. ఈ ఆందోళనలో పారిశుద్ధ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# చిన్న పిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు

**● ఎస్పీ మహేష్ బి. గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం జులై 01 నుండి 31తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్-11కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఎస్పీ ఎస్పీమహేష్ బి. గితే అధికారులకు ఆదేశించారు. ఆపరేషన్ ముస్కాన్-11కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ శాఖల అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీమాట్లాడుతూ ఆపరేషన్ స్మైల్ -11లో పాలుపంచుకొంటున్న ప్రతి ఒక్క అధికారి సమన్వయంతో పక్కా ప్రణాళిక రుపొందించుకోని బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేలా విధులు నిర్వహించాలన్నారు.ప్రతీ ఒక్కరి జీవితంలో బాల్యం అమూల్యమైనదని దానిని అనుభవించటం ప్రతీ పౌరుని హక్కు అని,క్షణికావేషంలో పిల్లలు తొందరపాటులో చిన్న చిన్న విషయాలకే తల్లి దండ్రులను విడిచి ఇంటికి దూరంగా ఉంటున్నారని,ఇట్టి అవకాశాన్ని ఆసరాగా తీసుకొని కొందరు వారిని ప్రమాదకర పనుల్లో వారితో పనులు చేయిస్తూ వారి జీవితాలతో ఆడుకుంటున్నారని అలాంటి వారిని గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు.

సిరిసిల్ల,వేములవాడ డివిజన్ స్థాయిలో ఒక ఎస్ఐ మహిళా పోలీస్ అధికారి, నలుగురు సిబ్బంది, వివిధ డిపార్ట్మెంట్ అధికారులతో ఏర్పాటు చేసిన రెండు టీమ్స్ జిల్లాలో పిల్లలతో పనిచేసే అవకాశాలు ఉన్న పలు పరిశ్రమలు,హొటల్స్,వ్యాపార సముదాయాలు, గోదాములు,మెకానిక్ షాపులు,హొటల్స్, ఇటుక బట్టిలు తదితర ప్రాంతాల్లో వ్యూహాత్మక తనిఖీలు నిర్వహించాలని అన్నారు.స్కూల్స్ కు వెళ్లకుండా వివిధ కారణాల వల్ల డ్రాపౌట్ అయిన పిల్లల తల్లి దండ్రులకు నచ్చ చెప్పి తిరిగి వారిని పాఠశాలకు పంపే ఏర్పాటు చేసి వారికి కొత్త జీవితాన్ని ఇవ్వాలన్నారు.ఎక్కడైనా బాల కార్మికుల కనిపిస్తే పోలీస్ వారికి సమాచారం తెలపాలని విజ్ఞప్తి చేశారు. 18సంవత్సరాల లోపు పిల్లలతో పని చేయుస్తున్న వారిపై 2024 సంవత్సరంలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్, ముస్కాన్ లో 21 మందిపై క్రిమినల్ కేసులు,ఈ సంవత్సరం జనవరిలో నిర్వహించిన అపరేషన్ స్మైల్ కార్యక్రమంలో 08 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరిగిందని అన్నారు.

ఈసమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల ఆర్డిఓ వెంకటేశ్వర్లు, డిడబ్ల్యూవో లక్ష్మీరాజాం, డిఆర్ డి వో శేషాద్రి, సిఐ లు నటేష్, నాగేశ్వరరావు,అసిస్టెంట్ లేబర్ అధికారి నజీర్ హమ్మద్, డాక్టర్ నయుమ్ జహా, విద్య శాఖ కోర్డినేటర్ సతీష్ కుమార్,షీ టీం ఏ ఏఎస్ఐ ప్రమీల,పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## నిత్య జీవనంలో వ్యాయామాన్ని భాగం చేసుకోవాలి..



**-ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ప్రతిరోజు ఉదయాన్నే కనీసం ఒక అరగంట వ్యాయామం,నడక ఏదో ఒకటి చేయాలని,సాధ్యమైనంత వరకు బయట ఆహారం తినడం మానివేయాలని ఎస్పీ మహేష్ బి.గితే అన్నారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ అవరణలోని పరేడ్ మైదానంలో జిల్లా ఆర్మూడ్ రిజర్వ్ ,సివిల్ పోలీస్ సిబ్బంది,హొమ్ గార్డ్ సిబ్బందికి వీక్లీ పరేడ్ నిర్వహించగా,ఈ పరేడ్ కి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం సిబ్బంది ప్రదర్శించిన ఆర్మ్డ్ డ్రిల్, ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్,సిబ్బంది ప్రదర్శనని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ రెగ్యులర్ గా హెల్త్ చెకప్ చేసుకోవాలని,వీక్లీ పరేడ్ వల్ల సిబ్బందికి క్రమశిక్షణ,యూనిటీగా ఉండడం, ఫిజికల్ ఫిట్నెస్ కి ఉపయోగపడుతుందన్నారు. క్రమశిక్షణతో డ్యూటీలు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందేలాగా పనిచేస్తూ పోలీస్ శాఖకి, జిల్లాకి మంచి పేరు తెచ్చేలాగా పని చేయాలని అన్నారు.సిబ్బందికి ఏదైనా సమస్య వుంటే ఎప్పుడైనా తనను కలుసుకొని తమ సమస్యను తెలియజేసు కోవచ్చని అన్నారు.ఈ పరేడ్ లో అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్ఐ లు రమేష్, మధుకర్, యాదగిరి,సిఐ లు కృష్ణ, మొగిలి, మధుకర్, ఎస్ఐ లు కిరణ్ కుమార్, వినిత రెడ్డి, జునైద్, శ్రవణ్ యాదవ్, ఆర్మూడ్ సిబ్బంది, సివిల్ సిబ్బంది,హొమ్ గార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ చెన్నాడి రవీందర్ రావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత

**బలగం టీవీ, బోయినిపల్లి**

డాక్టర్ చెన్నాడి రవీందర్ రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోరెం గ్రామానికి ఎమ్మెల్సీ వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైద్య రంగంలో వారు చేసిన సేవలను కొనియాడారు. వారి వెంట మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ రావు, డాక్టర్ అమిత్ రావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## 'అన్నపూర్ణ' పథకం పేరు మార్చడం హాస్యాస్పదం

**● మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవీ, హైదరాబాద్**



అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్చడం హాస్యాస్పదం, సిగ్గుచేటు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. రూ.5 భోజనం 'అన్నపూర్ణ' పథకం పేరు మార్చడంపై మండిపడ్డారు. ఢిల్లీ బాసులకు విధేయత కోసం వాళ్ల పేరును మార్చుకోవచ్చు కదా? అని ఎద్దేవా చేశారు. వాళ్ల పేరును రాజీవ్ లేదా జవహర్ గా ఎందుకు మార్చుకోకూడదు? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చాక ఈ అర్థరహిత చర్యలన్నింటినీ రద్దు చేస్తాం అని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఏసీబీకి చిక్కిన ఇద్దరు మున్సిపల్ ఉద్యోగులు

**బలగం టీవీ, సుల్తాన్‌బాద్**



: ఇంటి నంబర్ కోసం రూ.10వేలు డిమాండ్ చేసి రూ.ఐదువేల లంచం డిమాండ్ చేసి బాధితుడిని నుండి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఇద్దరు మున్సిపల్ అధికారులను పట్టుకున్నారు. ఈ సంఘటన శనివారం సుల్తానాబాద్ లో చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని ద్వారక నగర్ కు చెందిన ఆర్నకొండ ప్రసాద్ అనే వ్యక్తి నూతనంగా నిర్మించుకున్న ఇంటి నెంబర్ కోసం మున్సిపల్ సిబ్బందిని ఆశ్రయించాడు. కాగా బాధితుడిని సంవత్సరం పాటు ఆర్ఐ వినోద్, బిల్ కలెక్టర్ నాంపల్లి విజయ్‌కుమార్ రూ.10వేల డబ్బులు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఆర్నకొండ ప్రసాద్ చివరకు రూ.5వేలకు ఒప్పందం కుదుర్చుకుని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు రైడ్ చేసి ఆర్ఐ వినోద్, బిల్ కలెక్టర్ నాంపల్లి విజయ్‌కుమార్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ కార్యక్రంలో ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్, సీఐలు కృష్ణ కుమార్, తిరుపతి, పూర్ణచందర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆర్ఎంపీ వైద్యం వికటించి చిన్నారి మృతి..!

**బలగం టీవీ, చందుర్తి**

సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కిష్టంపేట గ్రామంలో ఆర్ఎంపీ వైద్యం కారణంగా ఓ ఎనిమిదేళ్ల బాలిక మృతి చెందిన విషాదకర ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు కోనరావుపేట మండలం బావు సాయిపేట గ్రామానికి చెందిన కదురిక రమేష్, సరిత దంపతుల కుమార్తె మహల (8) ఇటీవల తన అమ్మమ్మ ఇంటికి వచ్చిన సమయంలో జూన్ 19న తేలు కాటుకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను జోగాపూర్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు సంజీవ్ వద్దకు తీసుకెళ్లారు. ఆయన రెండు ఇంజెక్షన్లు ఇచ్చి గమనించాల్సిన అవసరం లేదని చెప్పి ఇంటికి పంపినట్టు సమాచారం. అయితే మరుసటి రోజు ఉదయం మహల అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వెంటనే వేములవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, అక్కడ పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని మరో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. సుమారు వారం రోజుల పాటు చికిత్స పొందిన చిన్నారి శనివారం ఉదయం మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. బాలిక తల్లి సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్ఎంపీ డాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జిల్లెల రమేష్ తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలి

**మాతా, శిశు సంరక్షణ జిల్లా అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి**

**100 పడకల ఏరియా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ**

**బలగం టీవీ, కోరుట్ల**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలని మాతా, శిశు సంరక్షణ జిల్లా అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి సూచించారు. శనివారం కోరుటపట్టణంలోని ప్రభుత్వ 100 పడకల ఏరియా ఆసుపత్రిలో ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసూతి వార్డులను పరిశీలించి, గర్భిణీ స్త్రీలు మరియు బాలింతలకు అందిస్తున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. తల్లి-బిడ్డల ఆరోగ్య పరిస్థితిపై ఆసక్తితో ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రిలో వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అలాగే పీహెచ్‌సీలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సూపర్వైజర్ల పనితీరును సమీక్షించారు. మహిళలకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు నిర్వహించాలంటూ సూచనలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత రాణి, వైద్యురాలు విజయలక్ష్మి, సూపర్వైజర్ ధనుంజయ్, ఫార్మాసిస్టు ఉదయ్ ప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.




## చరిత్ర సృష్టించిన ట్రావిస్ హెడ్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ చరిత్రలో ఓ మైలురాయిని అధిగమించాడు. డబ్ల్యూటీసీ చరిత్రలో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు గెలుచుకున్న ఆటగాడిగా నిలిచాడు.ఇప్పటివరకు జరిగిన 50 టెస్ట్ మ్యాచ్‌లలో 10 సార్లు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకొని ఈ ఘనత సాధించిన తొలి క్రికెటర్‌గా నిలిచాడు. తాజాగా వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో ట్రావిస్ హెడ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలు (59, 61) నమోదు చేస్తూ ఆసీస్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. 159 పరుగుల తేడాతో ఆసీస్ గెలిచిన ఈ మ్యాచ్‌లో హెడ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 180 పరుగులకు ఆలౌటైంది. వెస్టిండీస్ 190 పరుగులు చేసి స్వల్ప ఆధిక్యం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ 310 పరుగులు చేయగా, హెడ్ (61), వెబ్‌స్టర్ (63), క్యారీ (65) హాఫ్ సెంచరీలతో మెరిశారు. షమర్ జోసెఫ్ 5 వికెట్లు (5/87) పడగొట్టాడు. 301 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్ 141 పరుగులకే ఆలౌటైంది. షమర్ జోసెఫ్ (44) అత్యధిక పరుగులు చేశాడు. ఈ విజయం అనంతరం ట్రావిస్ హెడ్, డబ్ల్యూటీసీ చరిత్రలో అత్యధిక ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డులు గెలుచుకున్న ఆటగాడిగా నిలిచాడు. అతని తర్వాత బెన్ స్టోక్స్ (5), జో రూట్ (5), హ్యారీ బ్రూక్ (4) స్థానాల్లో ఉన్నారు. అలాగే హెడ్ ఇప్పటివరకు 50 టెస్ట్‌లు ఆడి 3,233 పరుగులు చేసి, అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో 6వ స్థానంలో ఉన్నాడు. ఇక రెండో టెస్ట్ మ్యాచ్ జూలై 3 నుంచి ప్రారంభం కానుంది.

# ఆరంభం అదిరింది

- ఇంగ్లండ్‌పై భారత్ మహిళల జట్టు విజయం
- స్మృతి మంధాన చారిత్రక రికార్డు
- మూడు ఫార్మాట్లలో సెంచరీలు చేసిన తొలి భారత మహిళా క్రికెటర్ గా స్మృతి

**బలగం టీవీ, నాటింగ్‌హామ్**

భారత మహిళల జట్టు ఐదు టీ20ల సిరీస్‌ను దుమ్ములేపే బోణీతో ప్రారంభించింది. శనివారం ట్రెంట్‌బ్రిడ్జ్‌లో ఇంగ్లండ్‌ను 97 పరుగుల తేడాతో ఓడించి, 1-0 ఆధిక్యం సాధించింది. కెప్టెన్ స్మృతి మంధాన శతకంతో చెలరేగగా, స్పిన్నర్ శ్రీ చరణి అద్భుత బౌలింగ్‌తో విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించింది.

**మంధాన శతకం - టీమిండియా భారీ స్కోర్**

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు, మొదటి నుంచి దూకుడు చూపించింది. ఓపెనర్‌గా వచ్చిన స్మృతి మంధాన అద్భుతంగా ఆడి 112 పరుగులతో నాటౌట్‌గా నిలిచింది. ఆమెకు సహకరిస్తూ హర్లీన్ డియోల్ 43 పరుగులు చేశాక ఔటైంది. వీరిద్దరి మెరుపు ప్రదర్శనతో భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 210 పరుగులు చేసింది. ఇది టీమిండియాకు పొట్టి ఫార్మాట్‌లో రెండో అత్యధిక స్కోర్ కావడం విశేషం.



బెహద్ భారీ లక్ష్యఛేదనలో ఇంగ్లండ్ ఆరంభం నుంచే తడబడింది. పవర్‌ప్లేలోనే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ (66) ఒక్కడా పోరాటం చేసినా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా శ్రీ చరణి (4 వికెట్లు, 12 పరుగులు) విజృంభించడంతో ఇంగ్లండ్ కేవలం 113 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ ఘన విజయం ద్వారా ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

భారత మహిళల క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్, కెప్టెన్ స్మృతి మంధాన క్రికెట్ చరిత్రలో తనకంటూ ఓ సువర్ణాధ్యాయాన్ని లిఖించుకుంది. శనివారం ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో అద్భుత శతకంతో చెలరేగిన ఆమె, అంతర్జాతీయ క్రికెట్‌లోని మూడు ఫార్మాట్లలో (టెస్టు, వన్డే, టీ20) సెంచరీలు నమోదు చేసిన తొలి భారత మహిళా క్రికెటర్‌గా అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. ఈ చారిత్రక ప్రదర్శనతో ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ప్రతిభావంతులైన క్రీడాకారుల జాబితాలో ఆమె స్థానం సంపాదించింది.

## ఆ మ్యాచ్‌కు ముందు హొటల్ నుంచి బయటకు రాలేదు

**భారత వన్డే జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ**

**బలగం టీవీ, హైదరాబాద్**




టీ20 వరల్డ్‌కప్ 2024లో టీమిండియా 11 ఏళ్ల నిరీక్షణకు చెక్ పెడుతూ ఘనవిజయం సాధించింది. భారత వన్డే జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ నేతృత్వంలోని జట్టు అమెరికా-వెస్టిండీస్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ మెగా టోర్నీలో అద్భుత ప్రదర్శన చేసి ఛాంపియన్‌గా నిలిచింది. అయితే, ఈ టోర్నీలో పాకిస్థాన్‌తో జరిగిన హైటెన్షన్ మ్యాచ్‌కు ముందు జట్టును హొటల్ గదుల్లోనే నిర్బంధించారని రోహిత్ శర్మ వెల్లడించాడు. "పాకిస్థాన్‌తో మ్యాచ్‌కు ముందు భద్రతా దృష్ట్యా హొటల్ గదుల నుంచి బయటకు రావద్దని మాకు అధికారులు చెప్పారు. జట్టుకు ముప్పు ఉండొచ్చని హెచ్చరికలు వచ్చాయి. అందుకే మా భోజనం కూడా రూమ్‌కి ఆర్డర్ చేసి అక్కడే తిన్నాం. హొటల్ మొత్తం అభిమానులు, మీడియా, భద్రతా సిబ్బందితో కిక్కిరిసిపోయింది. అది చూసి ఇది సాధారణ మ్యాచ్ కాదని అర్థమైంది. స్టేడియానికి చేరుకునే సమయానికే పాక్-ఇండియా అభిమానులు సంబరాల్లో మునిగిపోయారు. నాకు గతంలో ఎన్నో ఇండియా-పాక్ మ్యాచులు ఆడినా, ఈ మ్యాచ్ ముందు అనుభవించిన ఉద్వేగం మరిచిపోలేను" అని చెప్పుకొచ్చాడు.

## గుజరాత్‌లోనూ టీ20 లీగ్..

**బలగం టీవీ, హైదరాబాద్**



దేశవ్యాప్తంగా టీ20 క్రికెట్ లీగుల జోరు కొనసాగుతున్న తరుణంలో గుజరాత్ కూడా ఆ లైనప్‌లోకి అడుగుపెడుతోంది. ఇప్పటికే ఢిల్లీ, ముంబై, కర్నాటక, తమిళనాడు, బెంగాల్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు స్వంత టీ20 లీగులు నిర్వహిస్తుండగా, ఇప్పుడు గుజరాత్ క్రికెట్ సంఘం సైతం తమ టీ20 ఫ్రాంచైజీ లీగ్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేపట్టింది. ఈ మేరకు గుజరాత్ క్రికెట్ సంఘం కార్యదర్శి అనిల్ పటేల్ తాజాగా క్రిక్‌బజ్‌కు మాట్లాడుతూ, "2025-26 సీజన్‌లో గుజరాత్ టీ20 లీగ్‌ను ప్రారంభించాలనే ఆలోచనలో ఉన్నాం. టోర్నీలో ఎన్ని జట్లు పాల్గొనాలి? ఏ వేదికలు అనువైనవి? అన్న విషయాలపై చర్చలు జరుగుతున్నాయి. త్వరలోనే వేలం తేదీలు, జట్ల వివరాలు వెల్లడిస్తాం" అని తెలిపారు. గుజరాత్ లీగ్ లక్ష్యం: రాష్ట్రంలోని యువ క్రికెటర్లకు వేదిక కల్పించడం, వారిని వరల్డ్‌క్లాస్ ఆటగాళ్లుగా తీర్చిదిద్దడం, ఐపీఎల్, టీమిండియాలోకి అడుగుపెట్టే అవకాశాలను విస్తరించడం.

**దేశవ్యాప్తంగా టీ20 లీగుల జోరు:**

2008లో ప్రారంభమైన ఐపీఎల్ తర్వాత దేశవ్యాప్తంగా టీ20 ఫార్మాట్ క్రేజ్ పెరిగింది. ఇప్పటికే పలు రాష్ట్ర క్రికెట్ సంఘాలు తమ తమ ఫ్రాంచైజీ లీగ్‌లను నిర్వహిస్తూ యువతకు అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇటీవలే విదర్భ క్రికెట్ సంఘం కూడా టీ20 లీగ్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో గుజరాత్ లీగ్‌కు కూడా మంచి స్పందన లభించే అవకాశం ఉంది.

## 'తమ్ముడు' సినిమాకు 'ఏ' సర్టిఫికేట్


**బలగం టీవీ, హైదరాబాద్**




టాలీవుడ్ యువ హీరో నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'తమ్ముడు' సెన్సార్ పూర్తిచేసుకుంది. వకీల్ సాబ్ ఫేం వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ డ్రామాకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ 'ఏ' సర్టిఫికేట్ మంజూరు చేసింది. ఈ విషయాన్ని చిత్ర బృందం శనివారం అధికారికంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్‌కు మంచి స్పందన లభించడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. జూలై 4న ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది.

## వినోదాన్ని పంచుతున్న 'బాంబు' టీజర్

**బలగం టీవీ, హైదరాబాద్**




తమిళ నటుడు అర్జున్ దాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బాంబు' సహాయక పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న అర్జున్, ఈ సినిమాలో ప్రధాన పాత్రలో కనిపించనున్నాడు. దర్శకుడు విశాల్ వెంకట్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, శివాత్మిక రాజశేఖర్ కథానాయికగా నటిస్తోంది. తాజాగా విడుదలైన టైటిల్ టీజర్ ప్రేక్షకుల్ని కడుపుబ్బ నవ్విస్తోంది. టీజర్‌లో కాళి వెంకట్ చనిపోయాడని భావించి కుటుంబ సభ్యులు శోకిస్తున్న సమయంలో, అతను అకస్మాత్తుగా అపానవాయువు వదలడం హిలేరియస్‌గా తెరపై ఆవిష్కరించారు. ఈ సన్నివేశం చూసిన ప్రేక్షకులకు అతడు నిజంగా చనిపోయాడా? లేదా? అనే సందేహం కలుగుతుంది. అసలు విషయం తెలియాలంటే మాత్రం సినిమా చూడాల్సిందే.




## కిరీటి-శ్రీలీల జంటగా 'జూనియర్'

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ యంగ్ హీరో కిరీటి రెడ్డి, గ్లామర్ బ్యూటీ శ్రీలీల జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'జూనియర్' జూలై 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. రాధాకృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని వారాహి చలనచిత్ర పతాకంపై రజనీ కొర్రపాటి నిర్మించారు. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో సినిమాను సమకాలికంగా విడుదల చేయనున్నారు. శుక్రవారం విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. సరదాగా, హాయిగా జీవించే యువకుడిగా కిరీటి పాత్రను టీజర్ పరిచయం చేస్తూ, ప్రేక్షకుల్లో ఆసక్తి రేపుతోంది. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం టీజర్‌కు హైలైట్‌గా నిలిచాయి. అద్భుతమైన విజువల్స్, ఆకట్టుకునే డైలాగ్స్‌తో టీజర్ ఆద్యంతం ఆకర్షణీయంగా సాగింది. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ బ్యూటీ జెనీలియా టాలీవుడ్‌లోకి రీ ఎంట్రీ ఇవ్వనుంది. ఈ చిత్రంలో ఆమె కీలక పాత్రలో కనిపించనుందని సమాచారం.

## 'ది ప్యారడైజ్' సెట్స్‌లోకి నాని

**బలగం టీవీ, హైదరాబాద్**



'దసరా' బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' . ఇప్పటికే విడుదలైన అనౌన్స్‌మెంట్ టీజర్‌కు విశేష స్పందన లభించగా, తాజాగా ఈ సినిమా సెట్స్‌పై అప్‌డేట్ ఇచ్చాడు దర్శకుడు శ్రీకాంత్. నాని సెట్స్‌లో అడుగుపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా కొనసాగుతోంది.